క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది గ్రామ సచివాలయంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ కో–ఆర్డినేటర్ సీహెచ్ స్వాతిశ్రీ ఓ ప్రకటనలో సోమవారం వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో విశాఖపట్నానికి చెందిన మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి, రీసెర్చి ఇనిస్టిట్యూట్ వైద్యులు సేవలందిస్తారని పేర్కొన్నారు. ముఖ్యంగా కేన్సర్ నిర్ధారణకు స్క్రీనింగ్ పరీక్షలను ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు.

పరామర్శ



పోలినాయుడును పరామర్శిస్తున్న పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు టంకాల పోలినాయుడును పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ సోమవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన పోలినాయుడు పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద ప్రస్తుతం కోలుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రాజేష్ ఆ గ్రామానికి వెళ్లి, ఆయన ఆరోగ్యంపై ఆరా తీశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆరికతోట విద్యార్థుల సత్తా



సాధించిన కప్, పతకాలతో విద్యార్థులు

రామభద్రపురం: రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో మండలంలోని ఆరికతోట ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అనంతపురంలో ఈ నెల 23, 24, 25వ తేదీల్లో అండర్–17 విభాగంలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో విద్యార్థులు ఎం.జ్యోతిప్రకాష్, టి.తేజేశ్వర్, డి.రాఘవలు పాల్గొని, ప్రథమ స్థానంలో నిలిచారని వ్యాయామ ఉపాధ్యాయుడు వి.అప్పలనాయుడు తెలిపారు. సదరు విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు జీసీహెచ్ఎస్ శర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

రహదారి భద్రతపై అవగాహన సదస్సు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నీలావతి

రేగిడి: మండలంలోని సంకిలి సుగర్ ఫ్యాక్టరీ వద్ద రహదారి భద్రతపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. రహదారిపై వాహనాలు నడిపే సమయంలో డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్ఐ పి.నీలావతి వివరించారు. ఫ్యాక్టరీకి ట్రాక్టర్లు, లారీలు, టైరుబండ్ల ద్వారా ఇసుకను తరలించే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. ఓవర్ లోడ్‌తో ప్రయాణాలు చేయరాదన్నారు. కార్యక్రమంలో ఏపీపీ పట్టాభిరామిరెడ్డి, కేన్ ఏజీఎం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను చేరుకోవాలి

రాజాం సిటీ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. వేతనదారుల వ్యక్తిగత పనిదినాలు, వందరోజుల ప్రగతి, వేతనదారుల సంఖ్య, మినీ గోకులాల నిర్మాణాలపై సమీక్షించిన ఆయన.. ప్రతిఒక్కరూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



స్వామి కల్యాణం చేస్తున్న దృశ్యం

రాజాం సిటీ: మండలంలోని పొగిరి గ్రామంలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివాహం జరిపిన అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని తిరువీధి చేపట్టారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి, ఆరు వేల మంది భక్తులకు స్వామి వారి అన్నప్రసాదం అందజేశారు.

- రోజురోజుకూ పెరుగుతున్న ఊబకాయులు
- మోతాదుకు మించి ఆహారం తీసుకోవడం..
- వ్యాయామం చేయకపోవడంతో దుస్థితి
- ఆహార నియమాలు పాటించకుంటే తిప్పలు
- నేడు స్థూలకాయ వ్యతిరేక దినోత్సవం

భయపెడుతున్న.. ఊబకాయం!



రాజాం సిటీ:

శరీరంలో అవసరానికి మించి కొవ్వు చేరి, ఆరోగ్యానికి హాని చేసే వ్యాధి ఊబకాయం. దీనినే స్థూలకాయం అని కూడా పిలుస్తారు. మోతాదుకు మించి ఆహారం తీసుకోవడం, సరైన వ్యాయామం చేయకపోవడం, ఒత్తిడి, ధూమపానం, జంక్ ఫుడ్స్ తినడం వల్ల ఎక్కువగా ఈ వ్యాధి బారినపడతారు. కొన్నిసార్లు వంశపారంపర్యంగా కూడా ఇది రావొచ్చు. ఓ వ్యక్తి తన ఎత్తు, వయసుకు తగ్గట్టుగా ఉండాల్సిన బరువు కన్నా ఎక్కువ ఉంటే దానిని ఆరోగ్య సమస్యగా గుర్తించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో మన శరీరంలోని ఎంతో కొంత కొవ్వు తగ్గేలా వ్యాయామం చేస్తే ఊబకాయం ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చని సూచిస్తున్నారు.

జంక్‌ఫుడ్ ప్రభావం..

అధిక కేలరీలు కలిగి ఉండే ఆహారంగా చెప్పుకునే జంక్‌ఫుడ్ ప్రభావం పిల్లలు, పెద్దలపై తీవ్రంగా పడుతోంది. కొవ్వు పదార్థాలు, ఉప్పు, పంచదార తదితర వంటివి మోతాదుకు మించి ఉండే చిరుతిళ్లు చాలా ప్రమాదకరం. బర్గర్, పిజ్జా, కేకులు, నూడిల్స్, చిప్స్, స్వీట్స్, ఫాస్ట్‌ఫుడ్, కార్బొనేటెడ్ డ్రింక్స్, రెడీమేడ్ కూల్‌డ్రింక్స్ వంటివి కూడా జంక్ ఫుడ్ కిందికే వస్తాయి. ఇంకా మసాలా చాట్, పకోడీలు, బజ్జీలు, వెన్నతో కూడిన కేకులు, చాక్లెట్‌లు కూడా ఎక్కువగా తీసుకోకపోవడం ఆరోగ్యానికి చాలా మంచిది.



ఊబకాయం వల్ల వచ్చే సమస్యలు..

ఊబకాయం వల్ల గుండె సమస్యలు, మధుమేహం, నిద్రలో సరిగా ఊపిరి పీల్చుకోలేకపోవడం(గురక), కీళ్లకు సంబంధించిన వ్యాధులు, కొన్ని రకాలైన కేన్సర్లు వచ్చే అవకాశం ఉంది. ఊబకాయానికి తోడు ఆర్థిక సమస్యలు, నిద్రలేమి, సామర్థ్యానికి మించి పనిచేయడం వల్ల కొంతమంది రక్తపోటు బారిన కూడా పడుతున్నారు. శరీరంలో అధిక కొవ్వు పెరగడంతో హార్ట్(గుండె)పై అధిక ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో కొవ్వు కరిగించే వ్యాయామాలు చేసి, బరువు తగ్గాలని వైద్యులు సలహా ఇస్తున్నారు

ఏదీ.. మోతాదుకు మించి తినొద్దు..



పిల్లలు టీవీల ముందు కూర్చొని చిరుతిళ్లు ఎక్కువగా తింటుంటారు. ఈ పద్ధతిని తల్లిదండ్రులే మాన్పించాలి. పెద్దలు కచ్చితంగా వ్యాయామం చేయాలి. శారీరక శ్రమ పడితేనే అనవసర కొవ్వు అనే మాట ఉండదు. ఆరోగ్యకరమైన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, ఫైబర్(పీచు) ఉన్న పదార్థాలు అధికంగా తీసుకోవాలి. మాంసాహారం, ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు మానుకోవాలి.

– ఎం.కోటేశ్వరరావు, వైద్యాధికారి, ప్రాంతీయ ఆస్పత్రి, రాజాం



తెర్లాంలో స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో రాంబాబు, తహసీల్దారు హేమంత్‌కుమార్, ఎస్ఐ సాగర్‌బాబు తదితరులు

లింగ వివక్షను నిర్మూలిద్దాం

వాడవాడలా జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని, సమాజంలో లింగ వివక్ష లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిదీ అన్నారు. స్త్రీ, పురుషులిద్దరూ సమానమేనని, వారిలో ఏ ఒక్కరూ ఏ ఒక్కరి కంటే తక్కువ కాదన్నారు. పని ప్రదేశంలో, ఇళ్లల్లో మహిళలు హింసకు గురికాకుండా చూడాలని కోరారు. ప్రతిఒక్కరూ మహిళలను గౌరవించాలన్నారు.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



బాడంగి మండల కేంద్రంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా చేపట్టిన ర్యాలీలో ఎంపీడీవో రామకృష్ణ



బొబ్బిలిరూరల్: ర్యాలీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో రవికుమార్



సంతకవిటి: లింగ వివక్షను వ్యతిరేకిస్తూ సంతకవిటి మండల కేంద్రంలో విద్యార్థినుల మానవహారం

ఇలా అయితే.. చేతుల శుభ్రమెలా?



బొబ్బిలి మున్సిపల్ కార్యాలయంలోని హ్యాండ్‌వాష్ బేసిన్ నిరుపయోగంగా మారింది. చేతుల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు.. అలాగే కార్యాలయ సిబ్బంది అనుభవపూర్వకంగా చేతుల పరిశుభ్రతను పాటించడమే లక్ష్యంగా గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మెప్మా ఆధ్వర్యంలో దీనిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇది పనికిరాకుండా పోవడంతో పాత మున్సిపల్ కార్యాలయంలోని పాతసామాన్ల గదిలో ఇలా పడేశారు.

– బొబ్బిలి

అధికారుల నిర్లక్ష్యం.. భిక్షాటనలో బాల్యం!

అధికారుల నిర్లక్ష్యం కారణంగా బాలలు భిక్షాటనలో కనిపిస్తున్నారు. దీనికి నిలువెత్తు నిదర్శనమే ఈ చిత్రం. బడికి పోవాల్సిన పిల్లలు ఇలా రామభద్రపురం శివాలయం వద్ద బిచ్చమెత్తుకుని దుర్భరమైన జీవితం గడుపుతున్నారు. ఇలాంటి దృశ్యం కనిపించింది ఈ ఒక్కచోటే అయినా మనం చూడని ఎన్నో ప్రదేశాల్లో ఇలా బాలలు కుటుంబ అవసరాల కోసం శ్రమించాల్సిన పరిస్థితుల్లో మగ్గిపోతున్నారు. బడిబయట పిల్లలను గుర్తించి, పాఠశాలలో చేర్పించాలని విద్యాహక్కు చట్టం ఓ వైపు.. బాలకార్మికులు లేకుండా చూడాల్సిన బాలల పరిరక్షణ కమిటీ మరోవైపు ఉన్నా ఇటువంటి వారు కనిపిస్తుండడం దురదృష్టకరమని ఆలయానికి వచ్చిన వారు విమర్శిస్తున్నారు.

– రామభద్రపురం



కొనుగోళ్లలో జాప్యం.. రైతుల పాలిట శాపం!



ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం వహిస్తున్న జాప్యం.. రైతుల పాలిట శాపంగా మారింది. ఆరుగాలం ఎంతో కష్టపడి పండించిన పంటను పొలాల నుంచి కళ్లాలకు తరలించి, అమ్మకానికి ధాన్యం సిద్ధం చేశారు. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోళ్లు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కొన్నిరోజులుగా కళ్లాల్లోనే ధాన్యం కుప్పలు ఉండిపోయాయి. ఇంకెన్నాళ్లు ఇలా వేచి చూడాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదు సమయంలో సకాలంలో ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పిన అధికారులు సైతం ఇప్పుడు నోరు మెదపడం లేదని రామభద్రపురం మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– రామభద్రపురం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బొబ్బిలిరూరల్: మండలంలోని గోపాలరాయుడుపేట గ్రామ సచివాలయంలో కొత్తగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బేబీ నాయన సోమవారం ప్రారంభించారు. 17 శాతం తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లోకి సకాలంలో నగదు కూడా జమ చేయడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీలు, వ్యవసాయ శాఖ ఏడీ శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలిరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబీ నాయన

రైతులకు అండగా నిలవాలి..

వంగర: రైతులకు ప్రభుత్వం అండగా నిలవాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ కోరారు. మండలంలోని శివ్వాం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన కాసేపు మాట్లాడారు. రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, ఆ తర్వాత ధాన్యం నగదు తక్షణమే రైతుల ఖాతాల్లోకి జమ చేయాలన్నారు. తేమశాతం ఎక్కువ ఉన్నా రైతులను దృష్టిలో ఉంచుకుని, కొనుగోలుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బొక్కేల సత్యంనాయుడు, బొక్కేల వెంకట అప్పలనాయుడు, పిన్నింటి మోహనరావు, బెవర భాస్కరరావు, ఏను గుతల వెంకటనాయుడు, ఏవో తట్టికోట కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



వంగర: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

సమస్యలుంటే తెలియజేయండి

తెర్లాం: స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించి, పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, రైతులు సమర్పించిన వినతిపత్రాలను తహసీల్దారు జి.హేమంత్‌కుమార్ స్వీకరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏవైనా సమస్యలుంటే తెలియజేయాలని ప్రజలకు తహసీల్దారు సూచించారు. ఏ ఒక్క సమస్య పరిష్కారానికి జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్లాల్సిన పనిలేదని స్పష్టం చేశారు. ఎటువంటి సమస్యనైనా మండలంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలోనే పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రేగి రాంబాబు, ఎస్ఐ సాగర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి పలువురు గ్రామస్తులు వచ్చి, సమర్పించిన వినతిపత్రాలను ఎంపీడీవో ఎస్.రామకృష్ణ స్వీకరించారు. ఇకమీదట ఏ సమస్య అయినా మండల కేంద్రంలోనే పరిష్కరించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.



వినతిపత్రం స్వీకరిస్తున్న తహసీల్దారు హేమంత్‌కుమార్

సంక్షిప్తంగా...

సారా విక్రయిస్తే కఠిన చర్యలు

వంగర: సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ హెచ్చరించారు. సారా విక్రయిస్తూ పట్టుబడిన పలువురిని స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు దిరిశాల ధర్మరాజు ఎదుట సోమవారం హాజరుపరిచి, కౌన్సిలింగ్ ఇచ్చారు. సారా విక్రయిస్తూ పట్టుబడిన వారికి జైలు శిక్షతో పాటు రూ.లక్ష అపరాద రుసుం విధించడం జరుగుతుందని తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

బొబ్బిలి: విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఆ సంఘ సమావేశానికి హాజరైన ఆయన.. ఉపాధ్యాయులపై పనిభారం లేకుండా చూస్తున్నామన్నారు. జీవో నంబరు 117 రద్దు, ఓపీఎస్ అమలు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.పద్మావతి, సింహాచలం, ప్రవీణ్‌కుమార్, ఎల్లయ్య, కె.శ్రీను, రామకృష్ణ, రమేష్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రంతో కత్తెర పురుగు నివారణ

రాజాం సిటీ: మొక్కజొన్న పంటను ఆశించే కత్తెరపురుగు నివారణకు అగ్నిఅస్త్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ప్రకృతి వ్యవసాయం ఎంటీ పద్మ తెలిపారు. మండలంలోని నందబలగ గ్రామంలో అగ్నిఅస్త్రం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. మనం తయారు చేసుకున్న అగ్నిఅస్త్రాన్ని ఆరు నెలల పాటు నిల్వ చేసుకుని, మొక్కజొన్న పంటకు సోకే కత్తెర పురుగు నివారణకు ఆ పంటలో పిచికారీ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఎల్1 రమాదేవి, ఐసీఆర్‌పీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా సర్వే చేయాలి

రేగిడి: మండలంలోని బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ పరిధిలోని ఆశ కార్యకర్తలతో పీహెచ్‌సీ వైద్యాధికారి చలమయ్య సోమవారం సమావేశమయ్యారు. ఆశ కార్యకర్తలంతా తమ గ్రామాల్లో పక్కాగా ఫీవర్ సర్వే చేపట్టాలని, ప్రతీ ఇంటికి వెళ్లి ఎవరైనా జ్వరపీడితులు ఉన్నారో లేదో కనుక్కోవాలని ఆయన తెలిపారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, ఆరోగ్యంపై ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు.

రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు

బాడంగి: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను సాంఘిక సంక్షేమ అధికారి టి.సత్యనారాయణ సోమవారం సందర్శించారు. అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, రికార్డులను పరిశీలించి, పలు సూచనలు చేశారు. వసతి భవనాలు, రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు చేశామని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే ప్రతీ విద్యార్థి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో సోమవారం చేపట్టిన పారిశుధ్య పనులను జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు, సర్పంచ్ బండి బోడమ్మ, ఎంపీడీవో వి. శ్రీనివాసరావులు పరిశీలించారు. జనావాసాల మధ్య చెత్తాచెదారాన్ని పారవేయొద్దని ప్రజలకు వారు సూచించారు.



సంతకవిటి: గుళ్లసీతారాంపురం పురాతన శివాలయంలో పూజలందుకున్న శివలింగం



రామభద్రపురం: ధ్వజస్తంభం వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



తెర్లాం: కొరటాం శివాలయంలో భక్తుల సందడి



రాజాం గాయత్రీకాలనీలోని కాశీవిశ్వేశ్వరాలయంలో భక్తుల పూజలు

శివోహం..!

కార్తీకమాసం నాలుగో సోమవారం పురస్కరించుకుని, ప్రముఖ శైవక్షేత్రాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పరమ పవిత్రంగా భావించే ఈ మాసంలో సోమవారాల్లో పూజలకు భక్తులు అత్యంత ప్రాధాన్యమిస్తారు. వేకువజాము నుంచే మందిరాలకు పోటెత్తిన భక్తజనం.. గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చొని మనసారా దైవదర్శనం చేసుకుని, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. భక్తుల హర హర మహాదేవ.. శంభో శంకర.. శంభో శివ శంభో.. నినాదాలతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి.

– బొబ్బిలి, రాజాం నెట్‌వర్క్



రామభద్రపురం గిరిజా రామలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



వంగర: సంగాంలోని సంగమేశ్వరస్వామి ఆలయంలో దైవదర్శనానికి క్యూలైన్‌లో నిల్చొన్న భక్తులు



బొబ్బిలిరూరల్: వేగావతి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



బాడంగి: ముగడలోని శివాలయంలో శివలింగానికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు



బొబ్బిలి: దిబ్బవీధి శివాలయంలో శివలింగానికి జలాభిషేకం చేస్తున్న బాలుడు



రేగిడి: ఆమదాలవలసలోని శివాలయంలో భక్తుల పూజలు